క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం

రామసముద్రం: మండలంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కేశవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నర్సాపురం, 11 గంటలకు రాగిమాకులపల్లి పంచాయతీ, 11.30 గంటలకు కేసీ.పల్లి పంచాయతీల్లో గడప గడపకూ చంద్రబాబు మేనిఫెస్టో మోసాలు వివరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మదనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయితిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

శివాలయంలో రుద్రాభిషేకం



పూజలు చేస్తున్న పండితులు

పెద్దతిప్పసముద్రం: శివాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో శివుడికి పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం కర్నాటక రాష్ట్రానికి చెందిన పండితులు నియమనిష్టలతో వేద మంత్రోచ్ఛరణ నడుమ శతరుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. ఈ వేడుక తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల భక్తులు తరలివచ్చారు.

శంకరయ్య స్వామి ఆరాధన



ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

బి.కొత్తకోట: మండలంలోని శంకరాపురంలో వెలసిన శంకరయ్యస్వామి ఆరాధన గురువారం ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో భజనలు, కీర్తనలు చేశారు. ఆలయ నిర్వాహకులు కలశస్థాపన, గణపతి హోమ, నవగ్రహ శాంతి, భజనలు, అభిషేకాలు, సహస్ర నామార్చన, చెక్క భజన నిర్వహించారు. ఆదివారం వరకు ఉండే భక్తులకు విడిది ఏర్పాట్లు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



బాబురెడ్డి (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: మండలంలోని నవాబుకోటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబురెడ్డి (45) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఎంపీపీ మహమూద్‌తోపాటు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీలకతీతంగా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డుకు మరమ్మతులు



చదును చేయించిన రోడ్డు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అగ్రహారం సమీపంలోని తారురోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు పడుతూ లేస్తూ ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. జేఈ ఆదేశాల మేరకు వర్క్ ఇన్స్‌పెక్టర్ రెడ్డెప్ప గురువారం జేసీబీతో గుంతలను పూడ్చించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

అనుమతులు తప్పనిసరి

బి.కొత్తకోట: మండలంలో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకొనేందుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని సీఐ గోపాల్‌రెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి, వివరాలను పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు. ప్రైవేటు, ప్రభుత్వ స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేస్తే వారి నుంచి అనుమతి పొందాలని కోరారు. అగ్నిమాపక, విద్యుత్తు శాఖల అనుమతి తప్పనిసరి అని, నిబంధనలను తెలుసుకోవాలని కోరారు.

మహాకుంభాభిషేకం

కలికిరి: ఎల్లమ్మ ఆలయ మహాకుంభాభిషేకం సందర్భంగా మూడో రోజు గురువారం ఉదయం అమ్మవారికి కలశార్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో చండీ హోమం, కళా హోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటల నుంచి కుంభాభిషేకం చేశారు. ధర్మకర్త అశోక్‌కుమార్ రెడ్డి, నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, వెంకటరెడ్డి, సురేంద్రరెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

బస్ షెల్టర్ ఏర్పాటుచేయండి

గుర్రంకొండ: మండలంలోని తరిగొండలో బస్ షెల్టర్ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. తరిగొండ వెంగమాంబ పుట్టినిల్లు కావడంతో ఇతర జిల్లాల నుంచి భక్తులు బస్టాండులో నీడలేక ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు, ఆలయం పక్కన బస్ షెల్టర్లు లేవు. అధికారులు స్పందించి బస్‌షెల్టర్లు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వీధి కుక్కలతో జనం బెంబేలు

వీధి కుక్కల ధాటికి జనం బెంబేలెత్తిపోతున్నారు. గొర్రెలను చంపివేస్తుండడంతో కాపరులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు పక్కనే కోళ్ల వ్యర్థాలు పడేయడంతో వాటిని తినేందుకు అలవాటుపడిన కుక్కలు ఇపుడు మనుషులపైనా దాడికి తెగబడుతున్నాయి. ఈ దాడిలో గాయపడి పట్టణ వాసులు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇటీవల చిన్నారులపైనా, గొర్రెలమందపైనా దాడి చేయడంతో ప్రజలు వీధుల్లోకి వెళ్లాలంటే హడలెత్తిపోతున్నారు.

- గొర్రెలను చంపేస్తున్న కుక్కలు
- రోడ్ల వెంబడి వేళ్లే వారిపై దాడులు
- వీధుల్లో తిరగలేక చిన్నారుల ఇబ్బందులు



కోళ్ల వ్యర్థాలున్న పరిసరాల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

గుర్రంకొండ: పట్టణంలో 18 చికెన్ దుకాణాలను నిర్వహిస్తున్నారు. కోడిని కోసి అనంతరం ఆ వ్యర్థాలను కడప–బెంగుళూరు జాతీయ రహదారి, గుర్రంకొండ– గాలివీడు, గుర్రంకొండ– కలకడ మార్గాలలోని రోడ్ల పక్కనే ఇష్టానుసారంగా పడేస్తున్నారు. వందలాది కుక్కలు ఆ వ్యర్థాలను తినేందుకు అలవాటు పడ్డాయి. గుంపులు, గుంపులుగా అటు వైపు సంచరిస్తున్నాయి. కోళ్ల వ్యర్థాలను తిన్న తరువాత అవి చాలక అటువైపు వెళ్లే పాదచారుల పైన దాడులు చేస్తున్నాయి. వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తుండడంతో చిన్నారులు ఆ వీధులకు వెళ్లాలంటే హడలెత్తిపోతున్నారు. పట్టణం నుంచి పల్లెలకు వెళ్లే మార్గాల్లో ద్విచక్రవాహనాలపై దాడులకు దిగుతున్నాయి. ఒంటరిగా వెళ్లాలంటే జనం హడలెత్తిపోతున్నారు. కుక్క కాటుకు పలువురు రక్త గాయాలపాలవుతున్నారు.



రోడ్డు పక్కనే పడేసిన వ్యర్థాలు

రూ.5 లక్షల విలువైన గొర్రెలను చంపేసిన వైనం



పిచ్చికుక్క దాడిలో గాయపడిన బాలుడు

గుర్రంకొండ పరిసరాల్లో ఇటీవల గొర్రెల మందపై కుక్కల మూకుమ్మడిగా దాడిచేశాయి. కుక్కల దాడిలోరూ.5 లక్షల విలువచేసే గొర్రెలు, పొట్టేళ్లు మృతి చెందాయి. కాగా 15 గొర్రెలు గాయాలపాలయ్యాయి. దీంతో గొర్రెల కాపరులు హడలెత్తిపోతున్నారు. ఎప్పుడు కుక్కల దాడులు చేస్తాయోనని కాపాలా ఉంటున్నారు.

నెలరోజుల్లో నాలుగుమార్లు దాడులు



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

గత నెల రోజులుగా ఇందిరమ్మకాలనీ, తాళీం వీధి, బలిజగడ్డ వీధుల్లో వీధి కుక్కలు యథేచ్ఛగా సంచరించి ఇష్టానుసారంగా దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో ఇప్పటికే 16 మందితోపాటు, పలువురు ఆస్పత్రులపాలయ్యారు. ఇటీవల వీధిలో ఆడుకొంటున్న మూడేళ్ల చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గతంలో కుక్కల దాడిలో ఓ బాలుడు మృతిచెందగా పలువురు చిన్నారులకు రక్తగాయాలయ్యాయి. ప్రయివేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపైనా గతంలో దాడులు నిర్వహించిన సందర్భాలున్నాయి. వీధుల్లో గుంపులుగా వీధి కుక్కలు, పిచ్చి కుక్కలు సంచరిస్తుండడంతో జనంతోపాటు, చిన్నారులు హడలెత్తిపోతున్నారు. చిన్నారులు ఒంటరిగా కనిపిస్తే కుక్కలు దాడులు చేస్తుండడంతో వారి తల్లిదండ్రులు భయాందోళకు గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలపై కుక్కలు దాడులు చేస్తుండడం గమనార్హం.

చర్యలు తీసుకొంటాం

పట్టణంలో పిచ్చి కుక్కలు, ఊరకుక్కల సంచారం ఎక్కువగాలుంది. జనాలపై దాడులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. గతంలో చాలా వరకూ కుక్కల్ని పట్టి బయట ప్రాంతాలకు తరలించాం. మళ్లీ కుక్కల బెడద ఎక్కువైంది. తగిన చర్యలు చేపడతాం.

– శ్రీహరి, ఈవో, గుర్రంకొండ

కూటమి పాలనలో పేదలకు అన్యాయం

సమన్వయకర్త నిసార్ అహ్మద్



ప్రచారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పార్టీ నేతలు

మదనపల్లె: కూటమి పాలనలో మోసపోయిన జనం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని గుర్తు చేసుకుంటూ మళ్లీ జగన్ పాలనను కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. మదనపల్లె రూరల్ మండలంలోని బసినికొండ, కొండామర్రిపల్లె పంచాయతీల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు అమలయ్యాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ అధికారం లేకపోయినా మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన పోరాడుతూ అధికార పక్షాన్ని ప్రశ్నిస్తున్నారన్నారు. ప్రజల కోసం పోరాడడం జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వ పెద్దలు కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలతో అక్రమ అరెస్టులకు తెగబడుతున్నారన్నారు. మద్యం అక్రమ కేసులో ఎంపీ మిథున్ రెడ్డికి సంబంధం లేకపోయినా తప్పుడు ఆరోపణలతో వేధిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జి.షమీం అస్లాం మాట్లాడుతూ కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరవైందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నిసార్‌అహ్మద్, షమీం అస్లాం, శ్రీనివాసులురెడ్డిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, దండు కరుణాకర్ రెడ్డి, వెలుగు చంద్ర, మేరీ, ఇస్మాయిల్, శారదారెడ్డి, హబీబ్, కిశోర్, సుధాకర్, రమణ, నారాయణమ్మ, వెంకటరమణ, ముబీనా, మహబూబ్‌బాషా, విజయకుమార్, అమ్మాజన్, వినుత పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం కావాలి



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. మదనపల్లె పట్టణంలోని బిటీ కాలేజీ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ, చికెన్‌గన్యా, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు, న్యూమోనియా, అతిసారం, టైఫాయిడ్, కామెర్లు వంట జబ్బుల గురించి వివరించారు. జ్వరం వస్తే సమీప ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ క్రిష్ణవేణి, బీటీ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీదేవి, వైద్యులు డాక్టర్ భార్గవి, సల్మాన్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి కలీలుల్లాఖాన్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్‌హుస్సేన్

మదనపల్లె సిటీ: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కలిసికట్టుగా కృషిచేయాలని మదనపల్లె డివిజన్ లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్ హుస్సేన్ పిలుపునిచ్చారు. స్థానిక ఫోర్డు కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయనమాట్లాడుతూ బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది ఉజ్వల భవిష్యత్తు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఫోర్డు డైరెక్టర్ జిల్లా లలితమ్మ మాట్లాడుతూ తల్లిదండ్రులలో విద్య ప్రాధాన్యం గురించి తెలిసినప్పుడే వారి పిల్లలను విధిగా పాఠశాలలకు పంపుతారన్నారు. బాల్య వివాహాలు నియంత్రణకు కుటుంబవ్యవస్థ నుంచే పునాదులు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారిణి సునీత, సూపర్ వైజర్ శ్వేత, డాక్టర్ సౌమ్య పల్లవి, నిర్మల, అల్తాఫ్‌బాషా, జలజాక్షి, జయలక్ష్మి, సుభాషిణి, స్వర్ణ, నరసింహ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం గంగాధర్

తంబళ్లపల్లె: వెలుగు మహిళా సంఘ సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని ఏపీఎం గంగాధర్ కోరారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రూపుల నిర్వహణ, బ్యాంకు రుణాలు, పొదుపు, చెల్లింపులు, తదితర విషయాలపై చర్చించారు. అనంతరం మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా రామలక్ష్మి, కార్యదర్శిగా నౌజియా, కోశాధికారిగా ప్రమీల, ఉపాధ్యక్షురాలిగా సరస్వతమ్మ, ఉప కార్యదర్శిగా లక్ష్మీదేవిలు ఎంపికయ్యారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ అందరి సమష్టి సహకారంతో మండల సమాఖ్యను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. సీసీలు రమణ, నరసింహులు, బావావల్లి, ఆదిలక్ష్మి, వీఓ సభ్యులు పాల్గొన్నారు.

23న ఉచిత కంటి వైద్య శిబిరం

మదనపల్లె రూరల్: మండలంలోని వేంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 23న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్, మానవత మదనపల్లె అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. వారు మీడియాతో గురువారం మాట్లాడుతూ... తిరుపతి వేంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి సహకారంతో వేంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు రోగులను పరీక్షించి, చికిత్స అందిస్తారన్నారు. శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. వివరాలకు 08571–222215, 7330868914 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఐటీఐలో ప్రవేశాలు

తంబళ్లపల్లె: స్థానిక టీఎస్.వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు మూడో విడతగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నాగరాజు కోరారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను ఐటీఐ కార్యాలయంలో వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 29వ తేదీన కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

చైర్మన్‌ను నియమించాలి

మదనపల్లె రూరల్: రెడ్డి కార్పొరేషన్‌కు చైర్మన్‌ను తక్షణమే నియమించాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ ఎర్రగుంట్ల పద్మప్రియారెడ్డి డిమాండ్ చేశారు. మీడియాతో గురువారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో రెడ్డి సామాజికవర్గం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, పేదరికం, అవకాశ లోపంతో అనేక కుటుంబాలు సహాయం కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్, విదేశీవిద్య లోన్లు, స్వయం ఉపాధి, రుణ పథకాలు అమలుకావడం లేదన్నారు. గ్రామాల్లో రెడ్డి సమాజానికి ప్రత్యేకంగా సమగ్ర అభివృద్ధి పథకాలు అమలుచేయాలని కోరారు.

పాడి ఆవులు మృతి



మృతి చెందిన పాడి ఆవులు

తంబళ్లపల్లె: తంబళ్లపల్లెలో ఓ రైతుకు చెందిన రెండు పాడి ఆవులు గురువారం మృతి చెందాయి. రైతు సుధాకర్ తన మూడు ఆవులను బుధవారం సాయంత్రం పాలు పితికి ఇంటి పక్కనే షెడ్డులో మేత వేసి వెళ్లాడు. రాత్రి మేత వేసేందుకు వెళ్లగా ఒక ఆవు కాళ్లు అదురుతూ గిలగిల కొట్టుకుంటూ కిందపడి చనిపోయిందన్నారు. ఈ విషయాన్ని పశువైద్య సిబ్బందికి తెలియజేశామని ఉదయం మరో ఆవు చనిపోయిందన్నారు. కలుషిత ఆహారం తినడంతోనే ఆవులు చనిపోయాయని పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి తెలిపారు. దాణా నమూనాలను ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

అధికారుల తీరుతో కలికిరి వాసులకు ఇక్కట్లు

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం



సమస్య చెబుతున్న సర్పంచ్ వెంకటరెడ్డి

కలికిరి: తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారి నిర్మాణంతో కలికిరి వాసులకు ఇక్కట్లు తప్పడం లేదని ఎంపీటీసీ సభ్యులు అధికారులకు విన్నవించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. రోడ్లు, భవనాల శాఖ సమీక్షలో భాగంగా ఎన్‌హెచ్–71 సమస్యపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచారు. తిరుపతి నుంచి రాత్రి పూట కలికిరికి వచ్చే ప్రయాణికులు, వాహనదారులు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో సర్వీసు రోడ్డుకు మారాల్సి వస్తోందన్నారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో కలికిరి దాటి వెళ్లి కిలోమీటర్ల దూరం తిరిగి రావాల్సి వస్తోందని పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని కలకడ రోడ్డులో హైవే ఫ్లై ఓవర్ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ ఏర్పాటు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని సర్పంచ్ వెంకటరెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండల పరిసర ప్రాంతాల్లో గుట్టలు, చెరువుల నుంచి మట్టి, రాళ్ళు, కంకర, ఇతర సహజ వనరులను కొల్లగొట్టిన హైవే అధికారులు వాహనదారులు, ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడంలేదని మరికొందరు సభ్యులు తెలిపారు. 60 కిలోమీటర్ల పరిధిలో హైవే రోడ్డు అసంపూర్తిగా ఉంటే టోలుగేటు వసూలు చేయకూడదన్న నిబంధన ఉన్నా... గండబోయనపల్లి వద్ద టోలుగేట్ వసూలు చేస్తున్నారన్నారు, ఎంపీడీఓ మహమ్మద్ రియాజుద్దీన్ మాట్లాడుతూ మండల పరిషత్ తీర్మానాలు చేస్తే హైవే ఉన్నతాధికారులకు పంపి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ సమీక్షలో భాగంగా త్వరలో రైతులకు డ్రోన్ సదుపాయం అందుబాటులోకి రానుందని, రైతులకు కూలీల సమస్య తగ్గుదుందని ఏవో హేమలత తెలిపారు. ఎకరాకు రూ.450 ఇస్తే ఆరు నిముషాల వ్యవధిలో వికలాంగుల ఫించన్ల తొలగింపు సమంజసం కాదని, వారికి ధృవీకరణ మంజూరు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు పిర్యాదు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ ఎన్.చంద్రకుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ మాలతి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగా అనుమతుల మంజూరులో జాప్యం



మాట్లాడుతున్న అధికారులు

మదనపల్లె రూరల్: మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీలోని బుద్ధునికొండ సందర్శనకు, బౌద్ధ సమ్మేళనం నిర్వహణకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న ఎంపీ డాక్టర్.తిరుమావళన్ బుద్ధునికొండను సందర్శించేందుకు, అనుమతి ఇస్తామని పోలీసులు...గతంలో జరిగిన చర్చల సమయంలో చెప్పారన్నారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ అనుమతి కోరుతూ దరఖాస్తు చేశామన్నారు. ఇనుప కంచె నుంచి బుద్ధుడికి విముక్తి కలిపించేందుకు అనుమతివ్వాలన్నారు. ఉద్దేశ పూర్వకంగా అనుమతి ఇవ్వకపోవడం సరికాదన్నారు.

నల్లగుట్టపైకి వెళ్లేందుకు అనుమతిలేదు

మండలంలోని అంకిశెట్టిపల్లె పరిధిలోని నల్లగుట్టపైకి వెళ్లేందుకు ప్రైవేట్ వ్యక్తులకు అనుమతి లేదని తహసీల్దారు కిషోర్‌కుమార్‌రెడ్డి, తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ బాస్ పేరుతో నల్లగుట్టపై కంచె తొలగించి విగ్రహం ఏర్పాటుచేయనున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. ఈ విషయమై అంకిశెట్టిపల్లె గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు. మతపరమైన ఉద్రిక్తతలు ఏర్పడే అవకాశం ఉండడంతో ర్యాలీలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు నిరాకరిస్తున్నట్లు తెలిపారు. బుద్ధ విగ్రహం ధ్వంసం కేసు విచారణ చేసి నిందితులను అరెస్టుచేశామన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులపై ఆరోపణలు చేయడం తగదన్నారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన కూటమి ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె: అధికారం చేపట్టిన అనతికాలంలో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కేవీపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులను గురువారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి ప్రజల పక్షాన నిలబడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడానికి ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి ఆదుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందన్నారు. గతంలో అర్హత గల వారందరికీ పింఛన్లు అందించడం జరిగిందని, ఇపుడు రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులను తొలగించారన్నారు. ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న వైఎస్సార్‌సీపీ కొల్లు యర్రమరెడ్డి ఆరోగ్య స్థితి అడిగి తెలుసుకున్నారు. గోరంట్లపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లెలో కంభం కృష్ణారెడ్డి దినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, దినేష్ రెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, పి. ద్వారకనాథరెడ్డి, కోర్టు సుబ్బారెడ్డి, సంజీవరెడ్డి, వెంకటసిద్ధులు, సిద్ధయ్య, వేణుగోపాల్‌రెడ్డి, రామిరెడ్డి, నాగ, రవికుమార్‌రెడ్డి, అప్పిరెడ్డి, పెద్దసిద్ధయ్య పాల్గొన్నారు.

కలకడ: వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ద్వారకనాథరెడ్డి వాల్మీకిపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కసిరెడ్డి దామోదర్‌రెడ్డి, నూర్ అహమ్మద్, వెంకటరమణారెడ్డి, మురళి పాల్గొన్నారు.

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకీపురంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలికిరి మండల నేతలు గురువారం కలిశారు. నంగి మునిరెడ్డి, నీరుగట్టు సురేష్, రాంబాబు, షేక్ హసన్‌వలి, తానప్ప ఆయనను సన్మానించారు.

సమస్య పరిష్కరించాలని అంగన్‌వాడీల నిరసన



మదనపల్లెలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



మాట్లాడుతున్న యూనియన్ నాయకురాలు గౌరి

మదనపల్లె రూరల్: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచి, ప్రభుత్వ పథకాలు అమలుచేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) డివిజన్ అధ్యక్షురాలు మధురవాణి డిమాండ్ చేశారు. మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలతో కలిసి గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధురవాణి మాట్లాడుతూ...2014 నుంచి కేంద్ర ప్రభుత్వం, 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. 42 రోజుల సమ్మె సందర్భంగా వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన సెల్‌ఫోన్స్ పనిచేయలేదని, పోషణ్‌ట్రాకర్, బాలసంజీవని యాప్స్ అమలుకు సపోర్ట్ చేయడం లేదని ఆరోపించారు. లబ్ధిదారులకు ఫొటో క్యాప్చర్, ఓటీపీ, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరకులు ఇవ్వాలన్న నిబంధనతో అంగన్‌వాడీలు సకాలంలో పంపిణీ చేయలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. కే.విజయ, గీత, లక్ష్మీదేవి, భారతి, సుదర్శిని, అనసూయ, లలిత, రాధ పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. యూనియన్ నాయకురాళ్లు గౌరి, పార్వతి, కరుణశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎఫ్ఆర్ఎస్ విధానం రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీడీపీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సర్తాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సులోచన, సుజాత, స్వరూప, బాల, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షతో సమాజానికి బంధనాలు

కురబలకోట: లింగ ఆధారిత వివక్ష, భావనలు సమాజ ప్రగతికి బంధనాలుగా నిలుస్తాయని మానవ హక్కుల ఫౌండేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు బండారు మంగమ్మ అన్నారు. అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో గురువారం లింగ సున్నితత్వం, సాంఘీకీకరణ, లింగ ఆధారిత హింసపై డీటెక్ విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆడ మగ ఆలోచనలతో సమాజ అభివృద్ధికి కంచె వేసినట్లే అవుతుందన్నారు. ప్రతి వ్యక్తిని గౌరవంగా చూడడం, వివక్షకు తావివ్వకపోవడం ద్వారా ప్రగతి సాధ్యం అవుతుందన్నారు. లింగ సమానత్వం లేకుండా ఆశించిన అభివృద్ధి అసాధ్యమన్నారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ హేమలత, డాక్టర్ సమీనాఖాన్ పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం మానవతా సంస్థ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సంస్థ సభ్యులు

కలకడ: ప్రపంచ శాంతి కోసం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పీవీ.నాయుడు ఆధ్వర్యంలో కె.బాటవారిపల్లె పాఠశాల నుంచి కలకడ టౌన్‌లోని మూడు రోడ్ల కూడలి వరకూ గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాసులురెడ్డి, రెడ్డిశేఖర్, సుబ్బరామయ్య, వైవీ.రమణ, పీవీ.రమణ, జీవీ.రమణ, గంగాద్రినాయుడు, సుబ్బయ్య, లక్ష్మన్న, సయ్యద్ సాహెబ్, సుధాకర్ పాల్గొన్నారు.